# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

**అధికారులకు ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ ఆదేశం**



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం తన చాంబర్‌లో ఎంసీసీలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల లొకేషన్లు, ఎన్నికల వ్యయంపై జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ సమీక్షించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు, పోలీస్ శాఖ సీజ్ చేసిన మొత్తాన్ని జిల్లా ఫిర్యాదుల కమిటీ ద్వారా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రొనాల్డ్ రాస్ సూచించారు. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువ మొత్తంలో పట్టుబడిన నగదును ఆదాయ పన్ను శాఖకు పంపించి అక్కడి నుంచి విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత మొత్తాన్ని తిరిగి జిల్లా ఫిర్యాదుల కమిటీ ద్వారానే విడుదల చేయాలని భారత ఎన్నికల కమిషన్ ఎస్ఓపీ జారీ చేసినట్లు తెలిపారు. వివిధ నిఘా బృందాలు సీజ్ చేసిన మొత్తాన్ని నియోజకవర్గాల వారీగా నివేదిక అందజేయాలని ఎంసీసీ నోడల్ అధికారికి సూచించారు. సీజ్ చేసిన మొత్తంలో జిల్లా ఫిర్యాదుల కమిటీ విడుదల చేసిన మొత్తం వివరాలు అందజేయాలని ఆదేశించారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల లొకేషన్లు గుర్తించాలి**

సమస్యాత్మక(వల్నరబుల్) పోలింగ్ కేంద్రాల లొకేషన్లను గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని గుర్తించారో వాటిని పునరాలోచించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మరోసారి వాటి లొకేషన్లను గుర్తించాలన్నారు. నవంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో పోలీస్ బందోబస్తు ఉన్నందున పోలీస్ సిబ్బందిని నియమించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. పోలీస్ శాఖలో ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కోరారు. అంతేకాకుండా ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని రొనాల్డ్ రాస్ సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, అదనపు పోలీస్ కమిషనర్ లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్‌మాన్, ఈవీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

**కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన అధికారులు**

జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌లతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ చెక్‌పోస్టుల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పరిశీలించారు. అదే విధంగా సువిధ సెంటర్, ఈవీఎం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎంసీఎంసీ కంట్రోల్ రూంలను పరిశీలించారు.

## తనిఖీల పేరుతో దారిదోపిడీ.. కానిస్టేబుల్ డిస్మిస్

**ఆదేశాలు జారీ చేసిన రాచకొండ సీపీ చౌహాన్**

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ఉందంటూ తనిఖీల పేరుతో ఓ వ్యక్తి నుంచి రూ.18.5లక్షల నగదును దోచుకుని పరారైన ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్.చౌహాన్ డిస్మిస్ చేశారు. వివరాల్లోకి వెళితే.. 2018వ బ్యాచ్‌కు చెందిన ఆర్మ్‌డ్ పోలీస్ కానిస్టేబుల్ బల్లారి శ్రీకాంత్ పోలీసు వాహనం డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, ఈనెల 26వ తేదీ రాత్రి మరో వ్యక్తితో కలిసి పోలీసు యూనిఫాంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పంజాగుట్ట ప్రాంతంలో అటుగా వెళ్తున్న ఓ కారును ఆపారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీ చేయాలని సదరు వ్యక్తికి చెప్పారు. దీంతో ఆ వ్యక్తి కారు ఆపగా.. కానిస్టేబుల్ శ్రీకాంత్ కారును సోదా చేసి, అందులో ఉన్న రూ.18.5లక్షల నగదును తీసుకుని ఉడాయించాడు. షాక్‌కు గురైన బాధితుడు అదేరోజు అర్ధరాత్రి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దోపిడీకి పాల్పడింది రాచకొండ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ బల్లారి శ్రీకాంత్‌గా గుర్తించి అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న సీపీ చౌహాన్ ఎన్నికల తనిఖీ పేరుతో దోపిడీకి పాల్పడిన కానిస్టేబుల్ శ్రీకాంత్‌ను విధుల నుంచి డిస్మిస్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఎవరైనా పోలీసు సిబ్బంది ఇలాంటి అక్రమాలకు, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్ రూరల్, అక్టోబర్ 28 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.60లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం జరిగింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు అతడిని పూర్తిస్థాయిలో తనిఖీలు చేశారు. దీంతో అతడు ఎవరికి అనుమానం రాకుండా పేస్ట్ రూపంలో 971 గ్రాముల బంగారం దాచుకొని తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం రూ.60లక్షల ఉంటుందని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుప్తనిధుల కోసం తవ్వకాలు

**నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



గుప్త నిధుల కోసం తవ్విన గోతి

మహబూబాబాద్, అక్టోబరు 28: గుప్త నిధుల కోసం కొందరు గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ పొలంలో తవ్వకాలు జరిపించారు. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని ముందలి తండా గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన లింగాయిపల్లి మరియు తండా మధ్యలో ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో శుక్రవారం రాత్రి క్షుద్ర పూజలు చేసి తవ్వకాలు చేపట్టారు. పంటకు నీళ్లు పెట్టడానికి వెళ్లిన స్థానిక రైతులు అక్కడ జరుగుతున్న పూజలు మనుషుల కదలికలను గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకోగా, నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. మరో నలుగురు పోలీసులకు చిక్కారు. రెండు బైకులు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. ఏడాది కిందట అదే ప్రాంతంలో ఆంజనేయస్వామి విగ్రహం కింద తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత





నగదును చూపుతున్న ఎస్ఐ భరత్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 29 : మండల శివారు పరిధిలోని తెలంగాణ-కర్ణాటక బార్డర్ కస్తూర్‌పల్లి గ్రామ సమీపంలో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెక్ పోస్టులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరి నుంచి మొత్తంగా రూ. 3.36లక్షలు పట్టిబడినట్లు తెలిపారు. ఒకరి వద్ద రూ. 1.36లక్షలు, మరో వ్యక్తి వద్ద రూ.2లక్షలు తనిఖీల్లో పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఆ నగదును సీజ్ చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తంగా రూ.7లక్షల76వేల నగదు పట్టుబడినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

## యువతిపై హెడ్ కానిస్టేబుల్ లైంగిక వేధింపులు

వికారాబాద్, అక్టోబర్ 28 : వికారాబాద్ పట్టణానికి చెందిన ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ హెడ్ కానిస్టేబుల్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహులు శుక్రవారం రాత్రి ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినందున, అతడిపై వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. అతడిపై పోలీస్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కేసును వికారాబాద్ టౌన్‌పోలీస్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడిస్తాం

**దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్**





సమావేశంలో మాట్లాడుతున్న వడ్డమూరి కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 28 : రాష్ట్రంలోని దళితుల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్న టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కొడంగల్ నియోజకవర్గంలో ఓటమి తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ శక్తిని పెంచుకునేందుకు రెడ్డి సామాజిక వర్గానికి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రెడ్డిల ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు దళిత బహుజనులు కృషి చేయాలని కోరారు. పార్టీ ఫండ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నుంచి వసూలు చేస్తూ రేవంత్‌రెడ్డి కార్పొరేట్ వ్యాపారంగా మార్చివేశాడని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలను బహుజనులు ఐక్యతతో ముందుకు సాగి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వేదవృత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీశ్‌కుమార్, ఎన్నికల కమిటీ చైర్మన్ డాక్టర్ వీ.ఎల్.రాజు, డిప్యూటీ చైర్మన్ జె.ఎన్.రావు, కోఆర్డినేటర్ దేవునూరి శ్రీనివాస్, ఎండీ హుస్సేన్, కరుణాకర్, సుబ్బారావు, మద్దెల ప్రవీణ్‌కుమార్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన పరిశోధనలు జరగాలి

సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : సామాజిక, ఆర్థిక, అసమానతలు తగ్గించే విధంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సీతారామారావు అన్నారు. శనివారం యూనివర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'పరిశోధన విధానం-కేస్ అనాలిసిస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కోర్సుల రూపకల్పన, పాఠ్యాంశాలలో మార్పులు, చేర్పులు జరగాలన్నారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పరిశోధనలు వినూత్నంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్‌పవార్, ప్రోగ్రామ్ కో-డైరెక్టర్ ప్రొఫెసర్ వైస్ కిరణ్మయి, ప్రోగ్రామ్ కన్వీనర్ డా పి.రాధాకృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ సాల్మన్‌తో పాటు పలు విభాగాల డీన్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## '108'లో ఉద్యోగ అవకాశాలు

హయత్‌నగర్, అక్టోబర్ 28 : ఈఎంఆర్ఐ, హెచ్ఈఆర్ఎస్ఎఫ్ నందు పైలెట్స్, ఈఎంటీఎస్‌గా రంగారెడ్డి జిల్లాలో పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత్, జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, ఏఎన్ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీలో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని, పైలట్ కోసం ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతోపాటు బ్యాడ్జ్ లైసెన్స్ ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిరాక్స్ కాపీ సెట్‌తో హయత్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని 108 కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9154248992, 8309924615 నంబర్లను సంప్రదించాలన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ, అక్టోబర్ 28 : టీ-సేవ బ్యాంకు మిత్ర కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ వ్యాప్తంగా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు టీ-సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ టీ-సేవ బ్యాంకు మిత్ర ద్వారా డెబిట్‌కార్డ్స్, లైఫ్‌టర్మ్ ఇన్సూరెన్స్ చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్స్ బుకింగ్, కొత్త పాన్‌కార్డు, టెలికాం పోస్ట్ పెయిడ్, ప్రీపెయిడ్, ఆల్ బ్యాంక్స్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ అర్హత గలవారు వచ్చే నెల 10లోగా www.tsevacentre.comలో దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 8179955744 సంప్రదించాలన్నారు.

## గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు అరెస్టు



నవాబుపేట, అక్టోబర్ 28 : నవాబుపేట మండలంలోని లింగంపల్లి గ్రామంలోని పొలంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేసి పొలంలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.